# పునరావృతం

'సుమనశ్రీ'



చుక్కల్లో చంద్రుండు పరాచకాలాడుతు న్నాడు. వెన్నెల కురిపిస్తున్నాడు. వీరిగాడు ఈసురో మంటూ నీరసంగా నడుస్తున్నాడు. జైల్లోనుంచి బైట పడ్డాక యింతదాకా కడుపు నిండలేదంటే ఒట్టు. జేబులో ఏనాటిదో ఓ పావలా కాసుంటే ఏం కొనాలో తెలియలేదు వాడికి. ఏది కొంటే తన కడుపు నిండుతుంది? మిరపకాయ బజ్జీల పొట్లాం తీసుకొన్నాడు.

కడుపులో మంట విపరీతమై. దావానలంలా వళ్ళంతా వ్యాపించేసి చంపేస్తుంటే వాడు నలు వైపులా చూసాడు. వీధి కుళాయి వద్దకు పరుగెత్తి దాహం తీర్చుకున్నాడు. కడుపు మంచినీటితోనే నింపేసాడు. బీదోడు! అంతకంటే ఏంచేస్తాడు.

జైల్లో ఉన్నప్పుడే కాస్త బాగుంది. వేళకేదో కాస్త కూడన్నా దొరికేది. దరిద్రుడిపెళ్ళికి వడగళ్ళు వానన్నట్లు వానచినుకులు పడసాగాయి. నిలువ నీడ లేనోడు! పరిగెపి పరుగేసి ఓ చూరుక్రింద నించు న్నాడు.

నలువైపులా దయ్యంలా. భీకరంగా చీకటావ రించేసింది. రోడ్లన్నీ చిత్తడిగా తయారయ్యాయి. అలాగే ఆ చూరుక్రిందే కునుకుపాట్లు పడ్డాడు వీరిగాడు.

చిత్రంగా తెల్లారిపోయింది.

వళ్ళు దులుపుకుంటూ లేచాడు వీరిగాడు. కొట్లన్నీ తెరిచేస్తున్నారు. చేతుల్లో పెద్దపెద్ద చీపురు కట్టలేసు కొని బజార్లన్నీ ఊడ్చేస్తున్నారు. చురుకు చూపు లతో పైపై కొచ్చేస్తున్నాడు సూరిగాడు. వీరిగాడి కేంచేయాలో తోచలేదు. డొక్క బద్దలౌతూంటే దాన్నోదార్చేదెలా? ఆలోచనలో పడ్డాడు.

'ముత్తాలు!.నా చిలక ఎదురు చూస్తుంటుంది కాలినడకన పోతే గంట పడుతుంది. పోతేనో" బుర్ర గోక్కున్నాడు.

అన్యాయంగా ఇరుక్కున్నాడాయె. కల్లుసెట్టు కాడ ఖూనీ చేసేసింది ముత్తాలు." ఇకెట్టాబతకను మావాఁ" అని లబోదిబో మంది. కాయలు కాచేట్టు కొళ్ళటూ ఇటూ కొట్టేసుకొంది. క్రూరంగా చేతి వంకెళ్ళతో తల దించుకొచ్చేసాడు తను.

"ముత్తాలూ! వచ్చేత్తున్నా. నీకోసం వచ్చే త్తున్నా." గొణుక్కున్నాడు వీరిగాడు.

బయల్దేరాడు ముత్తాలు ముంగిట వాలటానికి.

రైలుగేటు దాటాడు.

దూరంగా గుడిసెలు కన్పిస్తున్నాయి. వీరిగాడి మనస్సెగిరి గంతేసింది.

'తన బంగారపు ముద్ద జున్నుముక్క. అబ్బ ముత్తాలుకి తానంటే మా చెడ్డ యిది.'

వీరిగాడి అడుగులు వడివడిగా పడుతున్నాయి.

క్రితంరాత్రి వానకి దోవంతా గత్తర గత్తరగా ఉంది. బురద బురద. వేసినకాలు తీయటంకష్టం. కాలినిండా మట్టి! దోవనో ఈదుతున్నాడు వీరిగాడు!

గుడిసెలన్నీ ఎండనో వెలిగిపోతున్నాయి.

పందులన్నీ గోల గోలగా అరుస్తున్నాయి.

దూరంగా ఓ పందిని కోసి పంచుకుంటున్నా రంతా. అటువైపు జుట్టూ జుట్టూ పట్టుకొని ఒక రిపై నొకరు పడిపోతున్నారు. సన్నగా డోమం సంగీతం వినిపిస్తోంది. బురదలో పొర్లాడుతోంది ఓ పంది గోడలన్నీ బోసిపోతున్నాయి.

నడుస్తున్నాడు వీరిగాడు. వడివడిగా పడు తున్నాయడుగులు.

పట్నానికి మాలపల్లికి ఎంత తేడా ఎండిపోయిన గుండెలో పాలుపీకి పీకి అవస్థపడుతున్నాడు పని వాడు. వాడి ఏడ్పు మాన్పలేక పోతోందా తల్లి! గోచీగుడ్డ కట్టుక్కూర్చున్నాడింటాయన.

దూరంగా పందుల కొట్టాం. చెవులు చిల్లులు పడేట్లున్నాయి వాటి అరుపులు

అదిగదిగో. ఆ కన్పడేదే ముత్తాలిల్లు వచ్చే కాడు వీరిగాడు. దగ్గరపడ్డకొద్దీ గుండె లాత్రంగా కొట్టుకొంటున్నాయి. కళ్ళన్నీ పెట్టుకొని చూశాడు

"అదేటి మావాఁ అలా సూత్తుండావ్ ఇలారా' పిలుస్తోంది సత్తెమ్మ. వీరిగాడువిచిత్రంగా చూస్తూ.

"అనే సత్తెమ్మా, నన్నియాలే జైల్లోంచొది లేసారు. ముత్తాలేమైంది' ఆత్రుతగా అడిగాడు.

"అదేటిమావాఁ తెలీనట్టడుగుతావ్. మారుమను వెళ్ళిపోనాది. అదీక లేదు. ఎటో ఎళ్ళిపోనాది" చేతులు తిప్పుకుంటూ చెప్పింది సత్తెమ్మ.

నెత్తిన పిడుగడ్డట్టయింది. మిన్నువిరిగి మీద పడిపోయింది

కడుపులో పేగు కలుక్కుమంది.

వీరిగాడు సగం చచ్చిపోయాడు!

* * *

నవ్వులతో. కేరింతలతో మారుమోగిపోతోంది క్లబ్బు. డబ్బంటే లక్ష్యం లేనివాళ్ళూ పేకాట జబ్బున్నవాళ్లూ, గూడుపురాణీగాళ్లూ చేరేప్రదేశం. పురోభివృద్ధిగోరేవాళ్ళంతా మొట్టమొదట క్లబ్బుల్లోనే తర్ఫీదు పొందాలి. మునిసిపాలిటీవాళ్ళు ప్రత్యేక శ్రద్ధతో కట్టించిందెందుకు మరి? ఊళ్ళో ఎన్ని క్లబ్బులుంటే అంత ఫార్వర్డ్' అన్నమాటావూరు!

తెల్ల గ్లాస్కోపంచెతో, సిల్కులాల్చీతో, నోట్లో పొడుగాటి వికార్పయిన గుంటూరు పొగాకుచుట్టతో

హుందాగా అడుగెట్టాడు పర్వతరావుగారు. పర్వతరావంటే పర్వతం అంత ఎత్తు ఉంటాడనుకుంటే అంతకంటే పొరపాటు ఉండదు. పల్లగా, పొట్టిగా దబ్బపండుసాల్లో ఉండే ఆయన్ని చూస్తే అందరికీ హడల్. అందుకే ఆయనంటే అందరికీ గౌరవం మరి భయం ఉన్నప్పుడేకదా భక్తి!

రెండు చేతివ్రేళ్ళకూ మిలమిల మెరిసే రాళ్ళ ఉంగరాలు! ఓ చేతి బంగారపు వెయ్యిమగల రిస్టువాచీ. వీలైతే రెండో చెయ్యికికూడా మరోటుండేదే! కానీ, సాహసించలేకపోయాడా మానవుడు.

ఆయనకి పేకాటకీ ఎడతెగని బంధం. పేకాటంటే ఆయనకు గానుగల బజార్లో ఉన్న రంగమ్మ కన్నా ఎంతో ఇష్టం. కాసంటే విలువలేనోడు కాబట్టి ఏ ఊసుపోయినా అడిగేవాడెవడున్నాడు!

పెద్దబజార్లో, బడా సెంటర్లో పుగాక్కంపెనీ. ఆ కంపెనీకి సర్వాధికారి! ఎటుచూసినా లక్షల్లక్షలు

పీకలదాకా తిని పేకాడటమే ఆయన పని!

ఆయనకింకా పుత్రోదయం కాలేదు. మనసుకి వెల్తిక పీడిస్తున్నదల్లా ఆ ఒక్కటే లోపం. తా సిరాను సంపాదించినదంతా అనుభవించే సుపుత్రుడు పుట్టలేదనే ఆయన శాస్త్రయం పూజలు చేయించాడు. గుళ్ళచుట్టూ ప్రదక్షిణాలు చేశాడు. విసుక్కుంటూనే మోకాళ్ళమీదపడి మ్రొక్కాడు. వడ్డీకాసులోడికి వడ్డీ చెల్లించాడు! కొండతిరణాల్లో ప్రభకట్టించి ఆపద్రుడికి రుద్రాభిషేకం చేయించాడు! ఎన్ని చెయ్యాలో అన్నీ చేశాడు. కానీ ఫలితం దక్కలా!

దేశంలో జనాభా పెరిగిపోతోందని వాయకులంతా నెత్తినోరూ బాదుకుంటూంటే పర్వతరావుగార్లాటి వాళ్ళెంతమంది పిల్లలకోసం తపించిపోతున్నారో!

డబ్బున్నవారికి పిల్లలుండరు! లేనోడికి గంపెడు సంతానం!

చిత్రంరా బాబూ ఈలోకం!

వస్తుతః మనిషిమంచోడే అంటారు కొంతమంది. రంగమ్మ [ఆ గానుగల బజార్లోదే] చెడగొట్టిందంటారు కొంతమంది.

'ఎవరు చెడగొట్టేదేంది! ఉత్త కుక్కలాంటోడైతే' అంటారు మరికొంతమంది. ఎలాటోడైతేనేం. డబ్బున్నోడు. ఎవడిమటా వాడిది!

పేకాట మా జోరుగా సాగిపోతోంది. చుట్టపొగ పిల్చి వదిలేస్తూ పర్వతరావుగారు సీరియస్‌గా ఆడేస్తున్నారు. ఓ ప్రక్క గ్లాసులో ద్రవం. అంతపట్టిగానా అని ఎవరైనా అంటే అన్నోడికసలు బుద్ధిలేదు. ఆయనకున్న "ఇన్‌ఫ్లుయన్స్" తెలిసున్నవాడెవడూ అలా మాట్లాడడు. చివరిదాకా వచ్చిన టాపీ కేసులెన్ని తుస్సుమనిపించాడో తెలిస్తే ఎవ్వరూ అలా అడగరు.

ఆటాడి అలసిపోయారంతా. ఎవరిళ్ళకివాళ్లు బయల్దేరుతున్నారు. పర్వతరావుగారు బయటికొచ్చారు. కిర్రు చెప్పులతో ఆయన్నడుస్తుంటే ఆ ఉగ్రరూపం కదం త్రొక్కినట్లుంటుంది. బయటంతా అంధకారం! మేఘాలచాటున దాక్కున్నాడు చంద్రుడు. రివాజుగా రిక్షావచ్చి నిల్చుంది! నెమ్మదిగా రిక్షాలో చేర్చాడు తన శరీరాన్ని. కళ్లు తేలిపోతున్నాయి.

రిక్షా బయల్దేరింది. ధోరణి మొదలైంది!

"ఒరేయ్! నీ పేరేంటిరా?"

"వీరిగాడంటారు బాబయ్యా రోజూ ఇలాగే అడుగుతారేమిటిబాబూ? పేరెన్నిసార్లు చెప్పలేదు."

"ఎక్కడికి... తోసుకు పోతున్నావు"

"ఇంకెక్కడికిబాబూ! రోజూ కాడికే"

"అరేయ్! రంగమ్మ కాడికేం? అది నిజంగా అప్సరసరా!...నీకేటి తెల్సు దాని పనా...నీకీ రిక్షా త్రొక్కటం కష్టంగా లేదూ?"

"ఏటిసేస్తాం బాబూ! టిపోటి. కట్టపడందే కూడెట్టా వస్తాది బాబయ్యా"

"ఏదైనా నౌకరీ ఇప్పిస్తే చేస్తావురా!"

"మీ దయబాబూ! నౌక్రీ ఇప్పిస్తే మీకాడనే జిల్మంతా రుణపడి బ్రతుకుతానయ్యా!"

రిక్షా ఆగిపోయింది.

"రేపు ఆఫీసులో కనబడు" అంటూ లోపలికడుగెట్టాడు పర్వతరావుగారు. తలుపు వారగా నిల్చుని ముసి ముసి నవ్వులు నవ్వుతూన్న రంగమ్మ నిజంగా అప్సరసలాగే కన్పించిందాయనకు.

* * *

వీరిగాడి గుండె కుదుటపడింది. పుగాకు కంపెనీలో వాచ్‌మన్‌గా కుదిరాడు. బండి హాయిగా నడుస్తోంది.

ఓ రోజు.

అర్ధరాత్రి దాటిపోయింది. దయ్యాలు గుడ్లిప్పి తిరిగే వేళ జరగరాని ఘోరాలన్నీ జరిగేవేళ పడిగుడ్లతో గొంతులు కోసేవేళ ఆ రోజు మరీ భయంకరంగా ఉంది కాళరాత్రి.

రక్తవర్ణపు రంగుతో భయంకరంగా కన్పించే నాల్కలతో ఎర్రగ్రాచుడు విచ్చలవిడిగా విహరించే సమయం!

అనాడు క్రూరంగా రంగమ్మ హత్య గావింపబడ్డదినమయంలోనే పేదల పాలిట కల్పవృక్షం-పరపరాజు నేలకూలిందీ వేళే. నక్కల అరుపులతో మారుమ్రోగుతోంది శ్మశానం. ముప్పిపాలిటీ కవాళ్ని బైటికి లాగుతున్నాయి కుక్కలు.

ఊరు నిద్రోతోంది. చుట్టూ చిమ్మచీకటి. ఎక్కడ అలికిడి విన్పించినా ఉలిక్కిపడి చూస్తున్నారిద్దరూ. చేతుల్లో టార్చిలైట్లు. పహారాహుషార్‌గా ఉంది. అందునా పుగాక్కంపెనీ. బాతాఖానీ వేసుక్కూర్చున్నారిద్దరూ.

"అరే! వీరిగా! నీకీ ఉద్యోగమేయిచ్చిందెవర్రా?" అడిగాడు నాగప్ప.

"అయ్యగార్ని రంగమ్మ కాడికి తోలుకెళ్ళేది నేనే గదేటి. బాబు దయచూసిండంతే" సమాధానంగా చెప్పాడు వీరిగాడు.

"అదినరే. రంగమ్మ సచ్చిపోనాది, తెల్సుగదేటి." సూటిగా చూశాడు నాగప్ప.

'అదేటో సంపిచ్చేసేరట బాసే! ఎంత గాదో వచ్చిందో ఏటో! డబ్బున్న బాళ్ళతో పని పెమాదంరా బాబూ బహు జాగర్తగుండాల."

దభీమని దూకిన చప్పుడైతే ఉలిక్కిపడ్డారిద్దరూ

కంపెనీ అంతా రావణాసురుడి కాష్టంలా కాలిపోతోంది! నెత్తిన పిడుగుపాటులా తోచింది వీరిగాడికి. కాళ్ళాడలేదు. విరుచుకు పడిపోయాడు. నాగప్ప నిలువునా కూలిపోయాడు. క్రూరంగా చంపివేయబడినోళ్ళ రక్తం వరదలై పారినట్లనిపించింది. నిముషంలో సర్వం ధ్వంసమైపోయింది.

ఊరంతా అట్టుడికినట్టుడికిపోయిందీ విషయం.

ఎవరినోట బట్టినా ఈమాటే

ఊరంతా కట్టకట్టుకొని వచ్చి విచిత్రంగా అవశేషాలను చూసింది.

పోలీసులు హడావిడిగా వచ్చారు.

వాచ్‌మేన్‌లనిద్దర్నీ అరెస్టుచేసి తీసుకుపోయారు.

రహస్యంగా విన్న మాటేంటంటే పర్వతరావుగారికి వాళ్ళిద్దరిమీదే అనుమాన మున్నదట! ఏదో ఎవరో నాలు రాళ్లు ముట్టచెప్తానంటే వాళ్ళే చేసుంటారని నమ్మారంతా.

కోర్టువారు కేసు ధృవపరిచారు.

వీరిగాడికి మళ్ళీ జైలు ప్రాప్తమైంది.

పిచ్చోడు! వాడికి సాక్ష్యం పలికేదెవడూ వాడివైపు మాట్లాడే ప్లీడరెవడూ!

* * *

ఇన్సూరెన్సు డబ్బు మొత్తం ముట్టింది పర్వతరావుగారికి.

పొట్ట కట్టల్చుదుకొని పిచ్చిగా నవ్వుకున్నాడాయన.

లోకాన్ని నమ్మించి మోసంచేయటం అందరికీ చేతకాదు.

అలాంటి అమోఘమైన బుర్రుండొద్దూమరి!

